క్లుప్తంగా

త్యాగరాజస్వామి జయంతి



విజయవాడకల్చరల్: సద్గురు త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో సత్యనారాయణ పురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జయంతి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా గానం చేశారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, కార్తీక త్రివేణి, చిట్టా కార్తీక్, చిట్టా దీపక్, లంక తేజస్విని, పారుపల్లి ఇభానస్ సోదరులు సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థినులు త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలను మధురంగా గానం చేశారు. సంస్థ నిర్వాహకుడు సీవీ రావు త్యాగరాజ స్వామి కృతి వైభవం అంశంగా ప్రసంగించారు. రామలక్ష్మి నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సంగీత కళాకారులు, అభిమానులు త్యాగరాజ స్వామి విగ్రహానికి పూజలు చేశారు.

నేడు వీఎంసీలో 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర వాసులకు కల్పించే మౌలిక సదుపాయాలపై సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించే స్పందన కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని మూడు సర్కిళ్ల కార్యలయాల్లో జోనల్ కమిషనర్లు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఆయా కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు అందజేయాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని నగర వాసులు వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి




మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీ నుంచి గుణదల వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు విస్తరణకు సహకరించాలంటూ ఆదివారం నగరపాలకసంస్థ అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణలో రోడ్డుకు అవసరమైన స్థలాన్ని ఇచ్చిన వారికి బాండ్లు జారీ చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం సంబంధిత వార్డు సచివాలయంలో సంప్రదించాలని కోరారు.

గాయని ఉమాబలరాం సేవలు ఆదర్శనీయం



విజయవాడకల్చరల్: గాయని ఉమా బలరాం సంగీత సేవలు ఆదర్శనీయమని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంత రాయా గ్రంథాలయంలో ఆదివారం సీనియర్ గాయని ఉమాబలరాం ఏక గళ సినీ సంగీత విభావరి, శాస్త్రీయ సంగీత ఆరాధనా కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ గాయనీగా ఉమబలరాం దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలు ద్వారా ప్రతిభను చాటుకున్నారన్నారు. సేవా రంగంలోనూ ఆమె సేవలను అందించారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది మందికి నిత్యావసరాలను అందించారన్నారు. సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మదిర రోజా ప్రసన్నత చేతుల మీదుగా ఉమాబలరాం దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, టి.శ్రీనివాసరెడ్డి, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చేయూత ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. ట్రస్ట్ ఇన్‌చార్జి అండలూరి లత, విజయ్‌భాస్కర్ దంపతుల పర్యవేక్షణలో కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత రాష్ట్ర పురోహిత పరిషత్ అధ్యక్షుడు అరికట్ల గోవర్ధనశాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం 21 మంది చేత ఉపనయనాలు చేయించారు. కార్యక్రమంలో భవిరి రవి, మహర్షి శర్మ, మహేశ్వరం గణేష్, రాచకుళ్ల శ్రీనివాసరావు, అనురాధ, దార్ల సాంబశివరావు, కోసూరు గోపాలకృష్ణమూర్తి, లక్కోజు రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి
- సింగ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధృఢ సంకల్పం వల్ల రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. దీనిలో పాల్గొన్న వారు మాట్లాడుతూ పేదవారికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ధ్యేయంగా సీఎం జగనన్న నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలందరికీ చక్కని వైద్యం అందుతుందన్నారు. నిరుపేద ప్రజలు అధికంగా నివసించే సింగ్‌నగర్ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయడానికి గరుడ హాస్పిటల్ యాజమాన్యం ముందుకు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. వైద్యులు శ్రీహర్ష, ఇబ్రహీం ఆధ్వర్యంలో 300 మందికి ఉచితంగా కంటి, దంత, జనరల్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ ఒక్కరూ ఆరోగ్య విషయాల్లో అవగాహన పెంపొందించుకోవటంతో పాటు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యనిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. కార్యక్రమంలో వారు పాల్గొని సుమారు 250 మందిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గత టీడీపీ ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వంలో రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంక మణికాంత్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002 డీఎస్సీ ద్వారా వైద్య ఆరోగ్య శాఖలో 3500 మంది మి ఉద్యోగాలు పొందామన్నారు. అప్పట్లో 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని నోటిఫికేషన్‌లో పొందుపరిచారని చెప్పారు. 2018 వరకు పీఆర్సీ ప్రకారం జీతాలు పొందామన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం జీఓ నంబరు 27 తీసుకొచ్చి పీఆర్సీ ద్వారా వేతనాలు పొందుతున్న తమను కన్సాలిడేటెడ్ పే కిందకు మార్చి అన్యాయం చేసిందన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు గత ప్రభుత్వ నిర్ణయంతో అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బదిలీలకు అవకాశం కల్పించి ఊరట కల్పించిందని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 27ను హైకోర్టు సస్పెండ్ చేసిందన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఆదుకోవాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగాల కరుణాకర్ రెడ్డి, కోశాధికారి శీరం రమేష్, కోఆర్డినేటర్లు రవికుమార్, డి.మురళీధర్ పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

కంకిపాడు: మూడు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కంకిపాడు ఎస్ ఐ కె.సుధాకర్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు, కంకిపాడు, కోలవెన్ను శివారు మాదాసు వారిపాలెంలో మూడు చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. ఘటనల్లో చోరీకి పాల్పడ్డ విజయవాడ 2 టౌన్ వైఎస్సార్ కాలనీకి చెందిన దాసరి దానియేలు, విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ కు చెందిన మిందాల రాజును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. నిందితులను రాజమండ్రి జైలుకి తరలిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు.

టీడీపీ నాయకుల కవ్వింపు చర్యలు

- వైఎస్సార్ సీపీ స్టిక్కర్లపై టీడీపీ స్టిక్కర్లను అంటించిన వైనం
- పోలీసులకు వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు



న్యూఆర్ఆర్‌పేటలో వైఎస్సార్ సీపీ స్టిక్కర్‌పై అంటించిన టీడీపీ స్టిక్కర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలకు తెరలేపారు. పార్టీల మధ్య చిచ్చుపెట్టి గందరగోళ వాతావరణంలో అల్లర్లు సృష్టించాలనే అక్కసుతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గత నెలలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలతో వైఎస్సార్ సీపీ నాయకులు డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి స్థానిక ప్రజల అనుమతి ప్రకారం వారి వారి ఇళ్ల ముందు గోడలపై, తలుపులపై స్టిక్కర్లు వేశారు. అయితే ఇటీవల ఆ డివిజన్‌లో పర్యటించిన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ స్టిక్కర్లపై కావాలనే టీడీపీ స్టిక్కర్లను అంటించి, విబేధాలు సృష్టించేందుకు చర్యలు చేపట్టారు. వారి చేష్టలతో విసుగుపోయిన స్థానిక ప్రజలు విషయాన్ని కార్పొరేటర్ ఇసరపు దేవి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు విషయాన్ని తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకూ వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డివిజన్‌లో అల్లర్లు సృష్టించే విధంగా ఇటువంటి కవ్వించు చేష్టలకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు.


ఉత్సాహంగా యూత్ ఫర్ ఛేంజ్ 3 కే వాక్‌థాన్



బీఆర్టీఎస్ రోడ్డులో నిర్వహించిన వాక్‌థాన్‌లో పాల్గొన్న యువత

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేడు యువతలో పెరిగిపోతున్న ఒత్తిడిని తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యూత్ ఫర్ ఛేంజ్ 3కె వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ విజయవాడ జోన్ అధ్యక్షురాలు పులి బిందు, జోన్ వర్కింగ్ సెక్రటరీ యశ్వంత్ కృష్ణ అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో ఆదివారం లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ప్రపంచ అథ్లెటిక్ దినోత్సవం, జాతీయ బాలల యువత మానసిక ఆరోగ్య దినోత్సవం, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని యూత్‌ఫర్ ఛేంజ్ 3 కే వాక్‌థాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నారులు విద్యకే ప్రాముఖ్యత ఇస్తూ క్రీడలు, అథ్లెటిక్స్‌కు దూరంగా ఉంటున్నారని దీనివల్ల శారీరక ఆరోగ్యంలో అసమతుల్యతకు దారితీస్తుందన్నారు. వివిధ కారణాల వల్ల డిప్రెషన్‌కు గురవుతున్న టీనేజ్ పిల్లల ప్రస్తుత పరిస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు అవగాహన కోసం 3కే వాక్‌థాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కోశాధికారి ఎస్‌కే ఇర్ఫాన్, ఎం.వివేక్, ఎం.జయంత్‌కుమార్, జేడీ ఫౌండేషన్ చైర్మన్ ప్రియాంకరావు దుండి, జగన్ మురారి, హేమంత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు.

సందేశాత్మకంగా ఘంటసాల నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలోని ఓ సన్నివేశం

విజయవాడకల్చరల్: గాయకునిగా, సంగీత దర్శకునిగా, నిర్మాతగా ఎందరికో స్ఫూర్తినిచ్చిన గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితంలో జరిగిన అనేక సంఘటనలను నాటకంగా మలచి ప్రదర్శించిన ఘంటసాల నాటకం సందేశాత్మకంగా సాగింది. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం సాంస్కృతిక సమితి, మధురం సేవా సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ నిర్వహణలో ఘంటసాల సంగీత కళాశాలలో ఆదివారం ఘంటసాల నాటకం ప్రదర్శించారు. ఘంటసాల బాల్యం, సంగీతం నేర్చుకోవడానికి విజయనగరం వెళ్లడం, సంగీత రావు, కళావర్ రింగ్, ద్వారం వెంకట స్వామి నాయుడుతో పరిచయం, సంగీతం నేర్చుకోవడం, సినీ రంగ ప్రవేశం, ఆ రంగంలో విజయం సాధించడం, పద్మశ్రీ పురస్కారం పొందడం అంశంగా నాటకం సాగుతుంది.

రచన దర్శకత్వం, భాస్కరుని సత్యజగదీష్, ఘంటసాలగా ఇంద్రకుమార్, సావిత్రమ్మగా హారిక, ద్వారం వెంకటస్వామి నాయుడుగా జానకి రామయ్య, పట్రాయని సంగీత రావుగా కొండల రావు, కళావర్ రింగ్‌గా రామలక్ష్మి, కవి జాషువాగా శ్రీరాయలు నటించారు. సురభి కళాకారులు ప్రదర్శించిన ప్రతీ అంశంలోనూ సురభి నాటక సంప్రదాయం కనిపించింది. కార్యక్రమంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, గోళ్ల నారాయణరావు, డాక్టర్ ప్రభాకర్ సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

అసభ్యకర మెసేజ్‌లు పంపిన వ్యక్తిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తమ సెల్‌ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్నారంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవి నగర్ మధ్యకట్ట ప్రాంతానికి చెందిన దుర్గమ్మ అనే గృహిణి మొబైల్‌కు ఓ నెంబర్ నుంచి అసభ్యకర మెసేజీలు వస్తున్నాయి. ఆ నెంబర్‌కు ఆమె ఫోను చేసి ఎవరు మీరు ఎందుకిలా పంపుతున్నారని అడగ్గా మళ్లీ యధావిధిగా అదే మాదిరి అసభ్యకరంగా మెసేజీలు పంపడంతో విసుగుపోయిన ఆమె సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవీనగర్‌లో మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో కాపుసేవాసంఘం ఆధ్వర్యాన ఆదివారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. 700 మందికి మజ్జిగ అందజేశామన్నారు. వేసవి కాలం ముగిసే వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో దోహద పడతాయని కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు చిత్తరంజన్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ సమ్మర్ క్యాంప్‌లో అనుభవం కలిగిన టీచర్స్‌చే పుస్తక పఠనం, కథలు చదివించడం, వినిపించుట, పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, జనరల్ నాలెడ్జ్, బేసిక్స్ మేథమెటిక్స్, శ్లోకాలు, కోలాటం తదితర అంశాల్లో శిక్షణతో పాటు క్యారమ్, చెస్ వంటి ఆటలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిక్షణ శిబిరానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ కె.కృష్ణ ప్రణీత పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ప్రతాప్, పక్కన ఉమా సరస్వతి తదితరులు

విజయవాడ కల్చరల్: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు, భాషా వికాసానికి శ్రీశ్రీ కళావేదిక కృషి చేస్తోందని ఆ సంస్థ అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ సొసైటీ ఫెస్టివల్‌లో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక క్రియాశీలక సభ్యులతో ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలోనూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో సాహిత్య కార్యక్రమాలు, భాషా సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి శ్రీశ్రీ కళావేదిక లక్ష్యాలను వివరించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరీ భూషణం సంస్థ గతంలో నిర్వహించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టేలలిత, ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు హరిసర్వోత్తమ నాయుడు, ఓలేటి ఉమా సరస్వతి, కట్ల భాగ్యలక్ష్మి, కళావేదిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.

అల్లూరి స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువత దేశానికి సేవలు అందించాలని క్షత్రియ ఫెడరేషన్ సౌత్ చైర్మన్ సీహెచ్ వెంకటపతిరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతిపాటి శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహోన్నత వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, శర్వాణీ మూర్తి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశానికి అందించిన సేవలు ప్రతీ ఒక్కరి హృదయాల్లో ఎన్నటికీ నిలిచే ఉంటాయన్నారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘ అధ్యక్షుడు సామంతపూడి వెంకటేశ్వరరాజు, కార్యదర్శి దాట్ల భాస్కరరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, స్మారక గ్రంథాలయ అధ్యక్షుడు కాకర్లపూడి సుబ్బరాజు, కార్యదర్శి పి.వి.సుబ్బరాజు, సాంస్కృతిక సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందాలి..



వృద్ధులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకుని దేశానికి సేవ చేయాలని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. స్థానిక అయోధ్య నగర్‌లోని ఏపీ సుబ్బరాజు క్షత్రియ భవనంలో ఆదివారం క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్యశిబిరం వృద్ధులు, వితంతువులకు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి సేవలను కొనియాడారు. విశిష్ట అతిథి క్షత్రియ ఫెడరేషన్ సౌత్ చైర్మన్ సీహెచ్ వెంకటపతిరాజు, ఫ్రాంకిలిన్ పార్మిలేషన్ అధినేత సాగి కృష్ణంరాజు మాట్లాడారు. అనంతరం వృద్ధులు, వితంతువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆర్థిక సాయం అందజేశారు. క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు ఆంజనేయరాజు, కార్యదర్శి ఓ.ప్రసాద్ రాజు, కోశాధికారి ఏ.వేంకటేశ్వరరాజు కార్యవర్గసభ్యులు, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, క్షత్రియ యువజన సంఘం అధ్యక్షుడు వలివర్తి రామరాజు, కార్యదర్శి దాట్ల రాజేష్ వర్మ, శ్రీ అల్లూరి సీతారామరాజు సంస్కృతిక సంఘం అధ్యక్షుడు వేంకటేశ్వరరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు సర్కిల్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిశంకర్, ఏ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని వినతి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మినిమం టైంస్కేల్, ఎన్ఎంఆర్, ఫుల్‌టైం-పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయీస్ సర్వీసులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో మినిమం టైంస్కేల్, ఎన్ఎంఆర్, ఫుల్‌టైం పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయీస్ రాష్ట్ర సంయుక్త కార్యాచరణ కమిటీ రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. వారు 30 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంతో ఉద్యోగ విధులు నిర్వహిస్తూ అనేక తీవ్ర కుటుంబ ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినిమం టైం స్కేల్ ఎంప్లాయీస్ రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు బి.సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగానికి దాసరి చేసిన సేవలు వెలకట్టలేనివి



దాసరి నారాయణరావు స్వరాంజలి కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: దర్శకుడు దాసరి నారాయణరావు సినీ రంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం దాసరి జయంతి, ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం నాగేశ్వరరావుల స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ దాసరి నారాయణరావు అని ఎందరో యువ నటులను తెలుగు తెరకు పరిచయం చేశారన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో గాయకత్రయంగా పిలుచుకొనే ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం మధుర గీతాలను మనకు అందించారన్నారు. వివిధ రంగాలకు చెందిన బీవీ వీరభద్రరావు, జ్ఞాన కిషోర్, ప్రసంగించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, దండు చంద్రశేఖర్, మల్లాది స్వాతి, దుర్గానాగమణి, హేమమాలిని పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

ఘనంగా నవ్వుల దినోత్సవం



ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. క్లబ్ సభ్యులందరూ ఒక చోట చేరి చిన్నా పెద్ద తేడా లేకుండా నవ్వులు పూయించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.